క్లుప్తంగా

గంగాదేవికి పూజలు



గంగాదేవికి దీపోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: కార్తీక మాసంలో భాగంగా భక్తులు సోమవారం సంగమేశ్వరంలో గంగాదేవికి పూజలు నిర్వహించారు. ముందుగా కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం ఉమామహేశ్వరాలయంలోని శివలింగానికి కృష్ణాజలాలతో అభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన, మంగళహారతీ వంటి విశేష పూజలు చేసుకున్నారు. ఎగువ పుష్కర ఘాట్‌వద్ద ఉన్న గంగాదేవికి కార్తీక మూడో సోమవారం సూర్యాస్తమయ సమయంలో దీపోత్సవ కార్యక్రమాన్ని మహిళలు జరుపుకున్నారు.

ఇళ్ల స్థలాలు చూపించాలి



పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

కొత్తపల్లి: ఇళ్లపట్టాలు ఇచ్చిన వాటికి స్థలాలు చూపించాలని సీపీఐ మండల కార్యదర్శి వెంకటశివుడుయాదవ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని సచివాలయం, పెద్దగుమ్మడాపురం, గువ్వలకుంట్ల గ్రామ సచివాలయాల్లో అర్జీలు ఇచ్చారు. కార్యక్రమంలో బీకేఎంయూ నాయకురాలు నాగమణి, మహిళా మండలి నాయకురాలు ముర్తుజాబీ, సింగరాజుపల్లె శాఖ కార్యదర్శి చిన్న స్వాములు తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక హద్దులు చూపాలి

ఆత్మకూరు: మండలంలోని అమలాపురం గ్రామంలో ఎస్సీల శ్మశానవాటిక సరిహద్దులు చూపాలని బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షులు పల్లె చంద్రశేఖర్ సోమవారం తహసీల్దార్ రత్న రాధికకు వినతి పత్రం అందజేశారు.

అనుమతుల్లేని మరబోట్లు తిప్పకూడదు

కొత్తపల్లి: కృష్ణానదిలో అనుమతుల్లేకుండా మరబోట్లు తిప్పకూడదని ఎస్‌ఐ కేశవ సోమ వారం తెలిపారు. కార్తీకమాసం సందర్భంగా తెలంగాణలోని సోమశిల నుంచి కృష్ణానదిపై సంగమేశ్వరం ఆలయం వరకు మరబోట్లలో భక్తులను అధిక ధరలకు తరలిస్తున్నట్లు చెప్పా రు. ఇందులో అటు తెలంగాణ వారు గానీ, ఇటు ఆంధ్ర బోటు నిర్వాహకులు గానీ అనుమతులు లేకుండా మరబోట్లలో భక్తులను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రతిధ్వనించిన పంచాక్షరి మంత్రం

ఆత్మకూరు: మండల పరిధిలోని రుద్రకోడు క్షేత్రంతోపాటు పట్టణంలోని వివిధ శివాలయాల్లో కార్తీకమాస సోమవారం సందర్భంగా పంచాక్షరి మంత్రం మార్మోగింది. అన్ని శివాలయాల్లో భక్తులు పెద్ద ఎత్తున శివనామస్మరణ చేస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువ జామునే తల స్నానం ఆచరించి శివాలయాలకు చేరుకుని కార్తీక దీపాలు వెలిగించారు. రుద్రకోడు క్షేత్రంలో రుద్రాణి సమేత రుద్రకోటేశ్వరస్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచామృతాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు.

వృద్ధురాలిని కాపాడిన పోలీసులు

ఆత్మకూరు: ప్రమాదవశాత్తూ కాలుజారి బావిలో పడిన వృద్ధురాలిని ఆత్మకూరు పోలీసులు కాపాడారు. మండలంలోని ముష్టపల్లి గ్రామానికి చెందిన ఖాదరమ్మ సోమవారం బహిర్భూమికి వెళ్తున్న సమయంలో కాలుజారి బావిలో పడిపోయింది. బాధితురాలు కేకలు వేయడంతో అటుగా వెళ్తున్న పోలీసు కానిస్టేబుల్ మౌలాలి, హోంగార్డు చక్రపాణి గమనించి బావిలోకి దూకి కాపాడారు. స్థానికులు కానిస్టేబుల్, హోంగార్డులను అభినందించారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

శ్రీశైలంప్రాజెక్ట్: ఇళ్లు లేని పేదలకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ నాయకులు సోమవారం సున్నిపెంట సచివాలయంలో వినతి పత్రం అందజేశారు. పార్టీ కార్యాలయం నుంచి ప్రజలతో కలిసి ర్యాలీగా గ్రామసచివాలయం-1 చేరుకుని అధికారులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పులిరాజు, డి.ఓబులయ్య, అన్వర్‌బాషా, లక్ష్మయ్య పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

జూపాడుబంగ్లా: లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎస్‌ఐ లక్ష్మీనారాయణ హెచ్చరించారు. సోమవారం సాయంత్రం ఆయన కేజీ రోడ్డుపై వాహనాలను తనిఖీ చేశారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని ఆటో డ్రైవర్లకు సూచించారు. తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్‌తోపాటు వాహనాల అనుమతిపత్రాలు కలిగి ఉండాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపటం, మైనర్‌లకు వాహనాలిచ్చి బయటకు పంపించే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. లైసెన్స్, అధికలోడు, అనుమతిపత్రాల్లేని 10 మంది డ్రైవర్లకు జరిమానా విధించారు.

వసతి..అధోగతి

శిథిలావస్థకు చేరిన భవనాలు.. పెంకులు ఊడి పడుతున్న పైకప్పులు.. . దోమలకు ఆహ్వానంగా తలుపులు లేని కిటికీలు.. కంపుకొడుతున్న మరుగుదొడ్లు.. ఇలా సమస్యల వలయంలో వసతి గృహాలు కొట్టుమిట్టాడుతున్నాయి. విద్యార్థులు ఎవరికీ చెప్పుకోలేక గజగజ వణుకుతూ కాలం వెళ్లదీస్తున్నా కూటమి ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదు. సోమవారం సాక్షి బృందం శ్రీశైలం నియోజకవర్గంలోని కొన్ని హాస్టళ్లను విజిట్ చేయగా పలు సమస్యలు వెలుగులోకి వచ్చాయి. – ఆత్మకూరు

- వసతి గృహాల్లో సమస్యలు తిష్ట
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు





ఆత్మకూరు ఎస్సీ బాలికల వసతిగృహంలో సరిగా లేని లాకర్ రూమ్‌లు, బాలికల వసతిగృహంలో ఆరుబయటే చదువుకుంటున్న విద్యార్థులు



బాలికల వసతిగృహంలో మరమ్మతులకు నోచుకోని మినరల్ వాటర్ ప్లాంట్



ఆత్మకూరులో శిథిలావస్థకు చేరిన బాలికల వసతిగృహం మరుగుదొడ్లు



పెచ్చులూడిన బండిఆత్మకూరు బీసీ వసతిగృహం

సాక్షి విజిట్

అసలే నల్లమల అడవీ ప్రాంతం..

శ్రీశైలం, సున్నిపెంట వసతిగృహాలు నల్లమల అభయారణ్యంలో ఉన్నాయి. వీటికి ప్రహరీలు లేకపోవడంతో విషసర్పాలతోపాటు ఇటీవల చిరుతల భయం వెంటాడుతోందని విద్యార్థులు భయంభయంగా వెల్లడించారు. ఇప్పటికైనా వసతిగృహాల చుట్టూ ఎత్తైన గోడలను నిర్మించాలని విద్యార్థులు కోరుతున్నారు. ఆయా వసతి గృహాల్లో మినరల్ వాటర్ ప్లాంట్‌లు చెడిపోయాయి. అలాగే విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలు అందడం లేదు.

బోరు నీరే గతి..

ఆత్మకూరు మండలంలోని వసతిగృహాల్లో మినరల్ వాటర్ విద్యార్థులకు అందడం లేదు. పట్టణంలోని ఎస్సీ బాలికల వసతిగృహంలోనూ ఎనిమిది నెలలుగా వాటర్ ప్లాంట్ పని చేయడం లేదని విద్యార్థులు వాపోయారు. ఉన్న మినరల్ వాటర్ ప్లాంట్లు చెడిపోవడంతో బోరు నీటితోనే కాలం గడుపుతున్నట్లు విద్యార్థులు తెలిపారు. ఇటీవల ఆత్మకూరు సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు ఈ వసతిగృహాన్ని తనిఖీ చేసి, మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించినా చర్యలు శూన్యం. మరుగుదొడ్లు, సాన్ననపు గదులు కూడా సక్రమంగా లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక మండలంలోని దాదాపు అన్ని వసతిగృహాలు శిథిలావస్థకు చేరుకున్నాయి.

గదులు సరిపోక..

వెలుగోడు మండలంలోని పలు వసతిగృహాల్లో విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలు అందడం లేదు. వేల్పనూరు బీసీ వసతిగృహంలో గదులు సరిపోవడం లేదు. రెండుమూడ్రోజులకోసారి కోడిగుడ్లను ఇస్తున్నారు. అవి కూడా నాసిరకంగా ఉన్నాయని విద్యార్థులు వాపోతున్నారు.

పెచ్చులూడుతున్న పైకప్పు..

బండిఆత్మకూరు మండలంలో నాలుగు వసతిగృహాలు ఉన్నాయి. అందులో బీసీ వసతిగృహం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. పెచ్చులు ఊడి పడుతుండటంతో విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. వర్షాకాలం పూర్తిగా వర్షపునీటితో నీరు కారుతోంది. 61 మంది విద్యార్థులు ఉన్నారు. ఇరుకు గదుల్లో ఇబ్బందులు పడుతూ జీవనం సాగిస్తున్నారు. బాత్‌రూమ్‌లు కూడా సరిగా లేవు. వసతిగృహాలకు డోర్లు లేకపోవడంతో చలికి గజగజ వణికిపోతున్నామని విద్యార్థులు తెలిపారు.

ఆరుబయటకే..

మహానంది మండలంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో 150 మంది విద్యార్థులు ఉండగా వారు నిద్రించేందుకు అవసరమైన డార్మిటరీ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వసతిగృహంలో వాటర్ ట్యాంక్ లేకపోవడంతో దుస్తులను ఉతుక్కునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. మరుగుదొడ్లు లేకపోవడంతో ఆరుబయటకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.



ప్రహరీ లేని సున్నిపెంట వసతిగృహం

గదులు కారుతున్నాయి



మా హాస్టల్‌లో గదులు వర్షాలకు కారుతున్నాయి. వర్షం వచ్చిన రోజు మాకందరికీ నిద్ర ఉండదు. పుస్తకాలు, దుస్తులు తడిసిపోతాయేమోనని మేల్కొనే ఉంటాం. – రజిని, 9వ తరగతి, ఎస్సీ హాస్టల్, ఆత్మకూరు

చిరుతల భయం



మా పాఠశాలకు కాంపౌండ్ లేదు. ఇటీవల చిరుతలు వసాయేమోనని విద్యార్థులందరం భయంతో ఉన్నాం. అప్పుడప్పుడు మా వసతిగృహం సమీపంలో చిరుతలు సంచరిస్తున్నాయి. రాత్రివేళ బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నాం. అధికారులు స్పందించి కాంపౌండ్ నిర్మించాలి. – విష్ణుతేజ, సున్నిపెంట, గురుకుల పాఠశాల

కాస్మోటిక్ చార్జీలు ఇవ్వడం లేదు



కాస్మోటిక్ చార్జీలు ఇవ్వడం లేదు. ఇంటి నుంచే పేస్టు, సబ్బులు, నూనె తెచ్చుకుంటున్నాం. గతంలో హాస్టల్‌లోనే కాస్మోటిక్ చార్జీలు ఇచ్చేవారు. ఇప్పుడు ఇవ్వకపోవడంతో ఇబ్బందిగా ఉంది. నెలనెలా ఇంటికెళ్లి మా అమ్మానాన్నలను అడిగి తెచ్చుకుంటున్నాం – జయంత్, 8వ తరగతి విద్యార్థి

మరుగుదొడ్లు నిర్మించాలి



మరుగుదొడ్లు, టాయిలెట్లు సరిగా లేవు. పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. వాటికి మరమ్మతులు చేసి వినియోగంలోకి తేవాలి. ప్రస్తుతం మేము బయటకు వెళ్లే పరిస్థితి నెలకొంది. – సూర్యసాగర్, గిరిజన ఆశ్రమ పాఠశాల, మహానంది

సం'క్షామం'

- సంక్షేమ హాస్టళ్లలో వెక్కిరిస్తున్న వసతుల లేమి
- మరుగుదొడ్లకు తలుపుల్లేవు.. తాగేందుకు నీళ్లు లేవు



జూపాడుబంగ్లా బాలికల వసతి గృహం



నందికొట్కూరు బీసీ వసతి గృహంలో శిథిలావస్థలో ఉన్న మరుగుదొడ్లు



ఎస్సీ వసతి గృహం వంట గది దుస్థితి

నందికొట్కూరు: ఆర్థిక స్తోమత లేని బడుగు, బలహీన వర్గాల వారి పిల్లలు చదువుకునే వసతి గృహాల్లో వసతులు కల్పించకుండా కూటమి ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. నియోజకవర్గంలోని దాదాపు అన్ని హాస్టళ్ల పరిస్థితి దయనీయంగా ఉంది. కనీసం వసతులు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. నందికొట్కూరు కళాశాల బాలుర వసతి గృహంలో 43, బాలికల కళాశాల వసతి గృహంలో 18, కొణిదేల బాలుర వసతి గృహంలో 110, మిడుతూరు ఎస్సీ వసతి గృహంలో 149, పగిడ్యాల వసతి గృహంలో 58 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. నందికొట్కూరు బీసీ హాస్టల్‌లో 33, కళాశాల బాలుర హాస్టల్‌లో 58, బాలికల వసతి గృహంలో 8, బ్రాహ్మణకొట్కూరులో 170, కొత్తపల్లి బీసీ వసతి గృహంలో 235, జూపాడుబంగ్లా గురుకులంలో 685, పగిడ్యాల మండలం లక్ష్మాపురం గురుకులంలో 611, జూపాడు బంగ్లా కేజీబీవీలతో 269, మోడల్ స్కూల్‌లో 70, పాములపాడు మండలంలో కస్తూర్బాలో 240, మోడల్ స్కూల్‌లో 176, పగిడ్యాల కస్తూర్బాలో 120, మోడల్ స్కూల్‌లో 100 విద్యార్థులు ఉంటున్నారు. మరుగుదొడ్ల డోర్లు సైతం శిథిలావస్థకు చేరుకున్నా పట్టించుకునే నాథుడే లేరు. ఆర్వో ప్లాంట్లు పని చేయడం లేదు. గదులకు కిటికీలు లేవు. పేట్లు, గ్లాసులు, దుప్పట్లు, ట్రంక్ పెట్టెలు ఇవ్వలేదు. వసతి గృహాల్లో పిల్లలకు మౌలిక వసతులు కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

భక్తులతో పోటెత్తిన మహానంది



మహానందీశ్వరస్వామి దర్శనార్థం వస్తున్న భక్తజనం



ఓంకారం ఆలయ ఆవరణంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

మహానంది: కార్తీక మాసం, మూడో సోమవారం పురస్కరించుకుని మహానంది ఆలయం భక్తులతో పోటెత్తింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు. ఆలయ ఈఓ నల్ల కాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ఏఈఓ వై.మధు, ఆలయ పర్యవేక్షకులు అంబటి శశిధర్ రెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది ఏర్పాట్లు పర్యవేక్షించారు. వివిధ విభాగాల ద్వారా ఒకేరోజు రూ.15 లక్షలకు పైగా ఆదాయం సమకూరినట్లు ప్రాథమిక సమాచారం.

మహానందీశుడి దంపతులకు కల్యాణం

గంగ, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లకు స్థానిక అలంకార మండపంలో కళ్యాణం నిర్వహించారు. వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, నాగేశ్వశర్మ, శాంతారాంభట్, ఆంజనేయశర్మల ఆధ్వర్యంలో మాంగళ్య ధారణ, అక్షింతల సమర్పణ పూజలు చేశారు.

ఓంకార క్షేత్రంలో భక్తుల రద్దీ

బండిఆత్మకూరు: మండల పరిధిలోని గంగా ఉమా సమేత ఓంకారేశ్వరాలయానికి కార్తీక మాస మూడో సోమవారం సందర్భంగా భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులు పంచముగ్గల కోనేరులో పుణ్య స్నానాలు చేసి దీపాలు వెలిగించారు. అనంతరం ఓంకార సిద్దేశ్వర స్వామిని, అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

పంట కోత ప్రయోగం

మహానంది: పంట కోత ప్రయోగాల ఫలితాల్లో వచ్చిన సరాసరి దిగుబడుల ఆధారంగా పంటల బీమా లెక్కిస్తారని ఏఓ నాగేశ్వరరెడ్డి తెలిపారు. తిమ్మాపురం గ్రామ పరిధిలో సోమవారం పంట కోత ప్రయోగాలను నిర్వహించారు.

– **వెలుగోడు:** పట్టణ సమీపంలోని వరి పొలంలో ఏఓ పవన్ కుమార్ పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ సిబ్బంది రామకృష్ణ, వెంకటశివ, నాగమణి, పసల బీమా ఏజెంట్ ఖలీల్ అహ్మద్ పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

పగిడ్యాల: కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి అబ్దుల్‌మజీద్ సోమవారం లక్ష్మాపురం గ్రామ సచివాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు.

19 నుంచి ఆధార్ క్యాంపు

పాములపాడు: ఈనెల 19 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించనున్న మొబైల్ ఆధార్ క్యాంపు స్పెషల్ డ్రైవ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 19న రుద్రవరం, 20న పాములపాడు, 21న యర్రగూడూరు, 22న మిట్టకందాల గ్రామాల్లో ఆధార్ క్యాంపు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

బండిఆత్మకూరు: ఈనెల 19 నుంచి 22వ తేదీ వరకు, 26 నుంచి 29వ తేదీ వరకు 8 రోజుల పాటు మండల వ్యాప్తంగా అన్ని అంగన్‌వాడీ సెంటర్లలో ట్రైబల్ ఏరియాలో ఆధార్ స్పెషల్ అఫ్డేషన్ డ్రైవ్ క్యాంపులను ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీఓ ఎం.దస్తగిరి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ 2010 నుంచి 2016 వరకు ఎలాంటి ఆధారాలు లేకుండా చాలా మంది ఆధార్ కార్డు తీసుకున్నారని, వారందరు తమ ఆధార్‌ను అప్డేట్ చేసుకోవాలని సూచించారు.

సర్వేలను వేగవంతం చేయండి

వెలుగోడు: ప్రభుత్వ పథకాల సర్వేలను వేగవంతం చేయాలని ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి గ్రామ కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి సూచించారు. సోమవారం తన కార్యాలయంలో ఎంపీడీఓ పంచాయతీ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంక్ అకౌంట్ లేనివారు, అకౌంట్ ఉండి ఇనాక్టివ్లో ఉన్న వారు అందరూ రూ.250 తీసుకొని పోస్టల్ శాఖ సిబ్బందిని సంప్రదించి అకౌంట్‌ను ఓపెన్ చేయించుకోవాలన్నారు. జియో కోఆర్డినేషన్ సర్వేను వెంటనే పూర్తి చేయాలన్నారు. నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో భాగంగా ఆధార్ నెంబర్ బ్యాంక్ అకౌంట్‌కు అనుసంధానం చేయించాలన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

ఎన్‌పీసీఐ లింక్ వేగవంతం చేయాలి

పాములపాడు: ఎన్‌పీసీఐ లింక్, హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్ సర్వే వేగవంతం చేయాలని డీఎల్‌డీఓ ఆత్మకూరు సూర్యనారాయణ అన్నారు. సోమవారం మండలంలోని యర్రగూడూరు, పాములపాడు గ్రామ సచివాలయాలను తనిఖీ చేశారు. హౌస్ హోల్డ్ సర్వే పట్ల నిర్లక్ష్యం వహించొద్దన్నారు. బయోమెట్రిక్ హాజరు, రికార్డులు తనిఖీ చేశారు. ప్రతి రోజు ఉదయం సాయంత్రం బయోమెట్రిక్ హాజరు తప్పనిసరిగా వేయాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఆయన వెంట ఎంపీడీఓ చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి నాగశేషులు ఉన్నారు.

దరఖాస్తులను పరిష్కరించండి

కొత్తపల్లి: భూ రీసర్వే దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని తహసీల్దార్ ఉమారాణి సూచించారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఆయా గ్రామ రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నందికుంట, కొత్తపల్లి, శివపురం గ్రామాల రైతుల నుంచి వచ్చిన 243 దరఖాస్తులను ఈనెల చివరిలోగా పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న పాల్గొన్నారు.

భూగర్భ కేంద్రంలో విద్యుత్ ఉత్పాదన

శ్రీశైలం ప్రాజెక్ట్: తెలంగాణ ప్రాంతంలోని ఎడమగట్టు భూగర్భ జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పాదన కొనసాగుతూనే ఉంది. కుడిగట్టు కేంద్రంలో గత కొద్ది రోజులుగా ఉత్పాదన నిలిపివేశారు. కృష్ణానదీ యాజమాన్యబోర్డు శ్రీశైలంలో విద్యుత్ ఉత్పాదన నిలిపివేయాలని ఆదేశించినప్పటికీ ఎడమగట్టు కేంద్రంలో ఉత్పాదన జరుగుతూనే ఉంది. ఆదివారం నుంచి సోమవారం వరకు ఎడమగట్టు కేంద్రంలో 3.619 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. ఎగువ సుంకేసుల నుంచి 3,688 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరింది. జలాశయం నుంచి దిగువ ప్రాజెక్ట్‌లకు 16,938 క్యూసెక్కుల నీరు విడుదలైంది. ప్రస్తుతం జలాశయంలో 162.4372 టీఎంసీల నీరు నిల్వ ఉండగా నీటిమట్టం 874.80 అడుగులకు చేరుకుంది.

నూతన కార్యవర్గం

ఆత్మకూరు: ఆంధ్రప్రదేశ్ జూనియర్ ఫారెస్ట్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏర్పాటైంది. ఆత్మకూరు డివిజన్ ప్రెసిడెంట్‌గా ఎం.అనిల్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్‌గా సయ్యద్‌సామెబ్‌పీరా, సెక్రటరీగా తాహిర్, ఆర్గనైజర్ సెక్రటరీగా కావేరి, జాయింట్ సెక్రటరీగా కుమార్, ట్రెజరర్‌గా ఎస్.కె.అబిద ఎంపికయ్యారు. కార్యవర్గాన్ని సోమవారం స్థానిక అసోసియేషన్ కార్యాలయంలో సంఘం నాయకులు, ఉద్యోగులు అభినందించారు.

బేగరుల సమస్యలు పరిష్కరించాలి

పాములపాడు: శ్మశాన వాటికల్లో గుంతలు తీసి దహన సంస్కారాలు నిర్వహించే బేగరుల సమస్యలు పరిష్కరించాలని బేగరుల సంఘం మండల కార్యదర్శి పెయ్యాల జయరాజు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం మండలంలోని మద్దూరు, పెంచికలపల్లి సచివాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏళ్ల తరబడి బేగరి వృత్తి చేస్తున్న తమకు ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి గుర్తింపు లేకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సాల్మోను, మద్దెల భాస్కర్, హేమలత, దిబ్బన్న పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలివ్వాలి

పాములపాడు/మహానంది.: పేదలకు పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్ల స్థలంలో, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్ల స్థలంలో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని సీపీఐ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం బానకచెర్ల గ్రామ సచివాలయం వద్ద ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాలో సీపీఐ జిల్లా నాయకుడు రమేష్‌బాబు, మహానది మండలం బుక్కాపురం సచివాలయం ఎదుట చేపట్టిన ఆందోళనలో సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు పాల్గొని మాట్లాడాన్నారు.

– **జూపాడుబంగ్లా:** ఎన్నికలకు ముందు పంచాయతీల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్ల ఇళ్ల స్థలాలిస్తామన్న హామీని అమలు చేయాలని రైతు సంఘం జిల్లా నాయకుడు పిక్కిలి వెంకటేశ్వర్లు, సీపీఐ జిల్లా నాయకుడు రమేష్‌బాబు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సచివాలయం-2 వద్ద ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వెంకటేశ్వర్లు, రమేష్‌బాబు మాట్లాడుతూ లబ్ధిదారులు ఇల్లు నిర్మించుకునేందుకు పెరిగిన ధరలకు అనుగుణంగా ఇంటికి రూ.ఐదు లక్షల చొప్పున మంజూరు చేయాలన్నారు.

వ్యాసరచన పోటీలు

పాములపాడు: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక ఏఎస్‌ఆర్ జెడ్పీహెచ్ స్కూల్‌లో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం గోపాల్ మాట్లాడుతూ విజేతలకు గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలో బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ శాఖాధికారి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

వెలుగోడు: పట్టణంలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు విద్యాసంస్థల విద్యార్థులకు జిల్లా పరిషత్ హై స్కూల్‌లో వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయ అధికారిని సుమలత తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు 20న ముగింపు కార్యక్రమాల్లో బహుమతులు అందజేస్తామన్నారు.

పగిడ్యాల: గ్రంథాలయాల ప్రాముఖ్యత, బాలల దినోత్సవ ప్రాముఖ్యత అంశాలపై స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు లైబ్రేరియన్ మద్దమ్మ తెలిపారు.

బండిఆత్మకూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు, మోడల్ స్కూల్ విద్యార్థులకు వ్యాస రచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించామని గ్రంథాలయ అధికారి మధు తెలిపారు.



వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు

రెవెన్యూ అధికారుల అసోసియేషన్ ఎన్నిక

మిడుతూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షునిగా టి. కె సంజీవరాజును ఎన్నుకున్నట్లు గ్రామ రెవెన్యూ అధికారులు తెలిపారు. అలాగే ఉపాధ్యక్షుడిగా ఖాజా హుశేన్, ప్రధాన కార్యదర్శిగా వెంకటయ్యను ఎన్నుకున్నట్లు తెలిపారు.

పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలి

నందికొట్కూరు: పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా నాయకులు రఘురామ్మూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అర్హులందరికీ ఇంటి స్థలంతోపాటు పక్కా గృహాలు మంజూరు చేయాలంటూ సోమవారం సచివాయలం-7 వద్ద సీపీఐ నాయకులు ధర్నా నిర్వహించి సిబ్బందికి వినతి పత్రం అందజేశారు.